# ఏఎన్నార్ ఎప్పటికీ బతికే ఉంటారు

- అక్కినేని పురస్కారాల సభలో సినీ హీరో నాగార్జున
- గుడివాడ ఏఎన్నార్ కళాశాల ప్రాంగణంలో విగ్రహావిష్కరణ
- నటప్రస్థానం సావనీర్ ఆవిష్కరించిన మంత్రి కామినేని
- తొమ్మిది మంది ప్రముఖులకు అంతర్జాతీయ పురస్కారాలు





బుధవారం గుడివాడ ఏఎన్ఆర్ కళాశాలలో అక్కినేని నాగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కామినేని, నాగార్జున, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావుకు అక్కినేని పురస్కారం అందజేసి సత్కరిస్తున్న నాగార్జున, చిత్రంలో యార్లగడ్డ, కామినేని, అమల

**సాక్షి, విజయవాడ బ్యూరో:** ''నాన్న విగ్రహం పెట్టడం మొదట్లో ఇష్టం లేదు.. ఇప్పటికీ మా మధ్యనే ఆయన ఉన్నారన్న బలమైన ఫీలింగ్. ఆ తర్వాత పెద్దవాళ్లంతా చెప్పాక సరేనన్నాను. ఏఎన్నార్ అంటే... నాన్న, ఫిలాసఫర్, మంచి గైడ్ అని మాత్రమే అనుకునేవాడిని. ఇక్కడికొచ్చాక ఆయనో పెద్ద విద్యా సంస్థని అర్థమైంది. అందుకే ఆయన వారసులుగా ఏడాదికోసారి కుటుంబ సమేతంగా ఇక్కడకు వస్తాం''అని ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున చెప్పారు. కృష్ణా జిల్లా గుడివాడలోని ఏఎన్నార్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం సాయంత్రం డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ జరిగింది. రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్, హీరో నాగార్జున విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల సాంస్కృతిక వేదికపై అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో నాగార్జున ప్రసంగించారు. తన తండ్రి కేవలం నాలుగో తరగతి వరకే చదువుకున్నప్పటికీ నాలుగు తరాల వారు చదువుకునేందుకు వీలుగా విద్యాలయానికి ప్రాణం పోశారని చెప్పారు. ఆయన పేరును నిలబెట్టేందుకు విద్యార్థులంతా సహకరించాలని కోరారు. నూతన రాజధాని ప్రాంతంలో ఏఎన్నార్ పేరిట ప్రభుత్వ కళావేదిక ఏర్పాటు చేయించేందుకు సీఎంతో మాట్లాడతామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సీఎం చంద్రబాబు నాయుడు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ సిరిపురపు శంకర్ ప్రసంగించారు.

## అక్కినేని పురస్కారాలు ప్రదానం...

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేషమైన సేవలందిస్తోన్న తొమ్మిదిమంది ప్రముఖులకు నిర్వాహకులు అక్కినేని అంతర్జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పర్వతరావు, శాంతాబయోటెక్ అధినేత వరప్రసాదరెడ్డి, ఐఏఎస్ అధికారి సంపత్‌కుమార్, దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు, ప్రఖ్యాత హృద్రోగ నిపుణుడు డాక్టర్ మన్నం గోపీచంద్, విద్యావేత్త ఎంఎన్ రాజు, వంశీ ఆర్ట్స్ థియేటర్ వ్యవస్థాపకులు వంశీరామరాజు, నాటక రంగ ప్రముఖుడు గుమ్మడి గోపాలకృష్ణ, క్రీడారంగంలో రాణిస్తోన్న వెన్నం జ్యోతిసురేఖలు పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. వీరందరికీ హీరో నాగార్జున, మంత్రి శ్రీనివాస్‌లు శాలువాలు కప్పి జ్ఞాపికలను అందజేశారు. ఏఎన్నార్ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన మార్కాపురి వెంకట వరప్రసాద్ (మల్కాజిగిరి), చింతలకోట శంకర శివనారాయణ (విజయనగరం), మట్టా శ్రీవంశీ (బెంగళూర్)లకు నగదు బహుమతిని అందజేశారు. అక్కినేని నటనా ప్రస్థానంపై రూపొందించిన సావనీర్‌ను మంత్రి కామినేని ఆవిష్కరించారు. డాక్టర్ కేవీ కృష్ణకుమారి రచించిన మట్టిలో మనీషి పుస్తకాన్ని నాగార్జున ఆవిష్కరించారు. అక్కినేనిపై ప్రత్యేకంగా తయారు చేసిన వెబ్‌సైట్‌ను వర్ధమాన నటులు సుమంత్, సుశాంత్, అఖిల్‌లు ప్రారంభించారు. ఏఎన్ఆర్ కాంస్య విగ్రహాన్ని తయారు చేసిన ప్రఖ్యాత శిల్పులు కామధేను ప్రసాద్, శివప్రసాద్‌ను నాగార్జున సత్కరించారు. కార్యక్రమంలో గుడివాడ శాసనసభ్యుడు కొడాలి వెంకటేశ్వరరావు (నాని), మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణ, జెడ్పీ చైర్మన్ గద్దె అనూరాధ, అక్కినేని అమల, అక్కినేని కుమార్తె సుశీల, కుమారుడు వెంకట్ అక్కినేని, కొండబోలు రవి, వెన్నం మురళి పాల్గొన్నారు.